ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 21 మే 2025 www.prajaswaramdaily.com 4 pm

# 'పాక్ హైకమిషన్‌కు చెందిన వ్యక్తితో పెళ్లికి సిద్ధం'

### జ్యోతి మల్హోత్రా చాటింగ్ లీక్!

### భారత్ రహస్య కార్యకలాపాలపైనా చర్చ

న్యూఢిల్లీ : పాకిస్థాన్‌కు గూఢచర్యం ఆరోపణలపై అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పాక్‌లో వివాహం చేసుకునేందుకు ఆమె సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఐఎస్ఐతో సంబంధాలున్న హసన్ అనే వ్యక్తితో ఆమె గతంలో చేసిన చాటింగ్ వివరాలు తాజాగా బయటకొచ్చాయి. తాజాగా అవన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తనను పాకిస్థాన్‌లోనే వివాహం చేసుకోవాలని జ్యోతి కోరింది. దీంతో పాటు భారత్‌కు సంబంధించిన రహస్య కార్యకలాపాల గురించి కూడా చర్చించారు. అంతేకాకుండా ఆమెకు నాలుగు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని.. దుబాయ్ నుంచి వాటిలో డబ్బు జమ అవుతోందని దర్యాప్తులో తేలినట్లు సమాచారం. దీనిపై మరింత లోతుగా విచారణ కొనసాగుతోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పాక్ హైకమిషన్‌కు చెందిన వ్యక్తితో ఆమె వివాహానికి సంబంధించిన చాటింగ్ వివరాలు బయటకొచ్చాయి.





## మంత్రి ఉత్తమ్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్..

### మబ్బులు, గాలివాన నేపథ్యంలో అప్రమత్తమైన పైలెట్..

### వాతావరణ శాఖ సూచనలతో అత్యవసర ల్యాండింగ్..

### కోదాడ నుంచి హుజూర్ నగర్ కు రోడ్డుమార్గంలో ప్రయాణం

కోడాడ: తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు పెను ప్రమాదం తప్పింది. వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయినట్టు తెలిసింది. అయితే, మంత్రి ఉత్తమ్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ హుజూర్ నగర్ మండలం మేళ్ల చెరువులో ల్యాండ్ కావాల్సి ఉండగా మబ్బులు కమ్ముకోవడం, గాలివాన నేపథ్యంలో పైలెట్ అప్రమత్తమయ్యారు. దీంతో, అత్యవసరంగా కోదాడలో ల్యాండ్ చేశారు. అనంతరం, మంత్రి ఉత్తమ్ కుమార్.. కోదాడ నుంచి హుజూర్ నగర్‌కు రోడ్డు మార్గంలో వెళ్లిపోయారు.

# దేశ భద్రత, సమగ్రత కోసం
# రాజకీయాలకు తావులేదు

### ఉగ్రవాదంపై పోరు.. ప్రతీ భారతీయుడి దృఢ సంకల్పం

### సీఎం రేవంత్ రెడ్డి



దేశ భద్రత, సమగ్రతను కాపాడే విషయంలో రాజకీయాలకు ఏమాత్రం తావు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి, భారత వీర జవాన్లకు ఎప్పుడూ అండగా నిలబడుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవలి కశ్మీర్ ఘటనల నేపథ్యంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించి వారికి శాశ్వత గుణపాఠం చెప్పాలని కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించామని చెప్పారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ గారి వర్ధంతిని పురస్కరించుకుని డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం ముందు ఆ మహనేత విగ్రహానికి ముఖ్యమంత్రి గారు పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ గాంధీ గారి వర్ధంతి రోజున "ఉగ్రవాద వ్యతిరేక దినం"గా పాటిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు గుర్తుచేస్తూ ఉగ్రవాదంపై పోరాటం చేయడం ప్రతి భారతీయుడి దృఢ సంకల్పమని అన్నారు.

కశ్మీర్ లో పర్యాటకులపై కాల్పుల ఘటన, ఆపరేషన్ సిందూర్ సందర్భంగా పోరాటం చేస్తున్న వీర సైనికులకు అండగా తెలంగాణ ప్రభుత్వం మొట్టమొదటగా సంఘీభావ ర్యాలీ నిర్వహించిందని, కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటించామని గుర్తుచేశారు. గతంలో యుద్ధం జరిగినప్పుడు ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ గారు పాకిస్తాన్ కు గుణపాఠం చెప్పారని, ఉగ్రవాదులను నిర్మూలించడంలో మనకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆ యుద్ధం సందర్భంగా ఆనాడు అమెరికా, లేదా ఇతర దేశాల మధ్యవర్తిత్వాన్ని ఇందిరా గాంధీ అంగీకరించలేదని గుర్తుచేశారు. భారత దేశ భద్రతను కాపాడుకోవడంలో ఎవరి సూచనలు, మధ్యవర్తిత్వం అక్కర లేదని స్పష్టంగా చెప్పారని అన్నారు.

కశ్మీర్ ఘటనలపై పార్లమెంట్ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖర్గే తో పాటు అందరం కేంద్రానికి, పోరాటం చేస్తున్న వీర జవానులకు అండగా నిలబడ్డామని, ఇలాంటి సందర్భాల్లో రాజకీయాలకు తావివ్వకుండా దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. దేశాభివృద్ధిలో రాజీవ్ గాంధీ పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఓటు హక్కును 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించి యువతకు ఓటు హక్కు కల్పించారని, ఆధునిక సాంకేతిక నైపుణ్యంతో 21 వ శతాబ్దంవైపు దేశాన్ని నడిపించారని గుర్తుచేసుకున్నారు. రాజీవ్ గాంధీ గారి విగ్రహానికి నివాళులర్పించిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు గారు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గారు, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ గారితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, జీహెచ్ఎంసీ మేయర్ పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుకు షోకాజ్

### ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు చాంబర్ ఎదుట బైఠాయించి నిరసన

### వారంలో వివరణ ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్: తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావుకు మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్కా లాంబా షోకాజ్ నోటీసులు ఇచ్చారు. టీపీసీసీ అధ్యక్షుడికి వ్యతిరేకంగా గాంధీ భవన్‌లోనే ధర్నా చేసినందుకు చర్యలు తీసుకున్నారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

**ఇది విషయం**

పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఇటీవల సునీతారావు ఆధ్వర్యంలో మహిళా నేతలు గాంధీభవన్‌లోని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఛాంబర్ ముందు బైఠాయించి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళా కాంగ్రెస్ తీవ్రంగా శ్రమించిందని.. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా పార్టీ, ప్రభుత్వ నామినేటెడ్ పదవుల విషయంలో మహిళా కాంగ్రెస్‌కు అన్యాయం జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఎన్నిసార్లు కలిసినా ముఖ్యమంత్రిని కలవండి అని చెబుతున్నారని తెలిపారు.



## ఇదంతా కాంగ్రెస్, బీజేపీల నాటకం

### దిక్కుతోచని పరిస్థితుల్లోనే కేసీఆర్‌కు నోటీసులు

### ప్రజాపాలన కాస్త కమీషన్ల పాలనగా మారింది

### కేసీఆర్‌కు నోటీసులపై కేటీఆర్



హైదరాబాద్ : దిక్కుతోచని పరిస్థితుల్లోనే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజాపాలన కాస్త కమీషన్ల పాలనగా మారిందన్నారు. చట్టాల మీద విశ్వాసం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్‌కు నోటీసులపై కేటీఆర్ స్పందించారు. సమస్యలను గాలికి వదిలి నోటీస్ లు ఇస్తున్నారని రేవంత్ సర్కార్ పై ఫైర్ అయ్యారు. ఎన్ని నోటీసులిచ్చినా హామీల అమలుపై ప్రభుత్వాన్ని వదలమని అన్నారు. ఇదంతా కాంగ్రెస్, బీజేపీ కలిసి ఆడుతున్న నాటకమని కేటీఆర్ మండిపడ్డారు.

గత 17 నెలలుగా పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకు నాటకాలు ఆడుతోంది.. కమిషన్‌లు తప్ప ప్రభుత్వానికి మరో దారి కనిపించట్లేదు.. పాలన కనిపించడం లేదు.. డైరెక్ట్‌గా కాంట్రాక్టర్లు సచివాలయంలో ధర్నా చేయడం వాస్తవ పరిస్థితిని స్పష్టం చేస్తోంది.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే "కమిషన్‌లు లేనిదే పనులు జరగడంలేదు" అని స్వయంగా సాక్ష్యంగా చెబుతున్నారు.. ఈ రాష్ట్రంలో కమిషన్‌ల పాలన నడుస్తోంది - ప్రజల పాలన కాదు.. సీఎం రేవంత్ రెడ్డిని అడుగుతున్నా.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలింది, 8 మంది ప్రాణాలు కోల్పోయారు.. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేక పోయింది.. మీ కమిషన్‌ల అరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి సైతం సాహసం చేయలేకపోయారు.. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది.. నల్గొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది, ఇప్పటికీ ప్రభుత్వం స్పందించలేదు.. కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయి, ప్రజల సమస్యలపై కాకుండా పచ్చినాటకంపై దృష్టి... కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని బలి గొడుతున్నారు.. ఎప్పటికైనా న్యాయం, ధర్మం గెలుస్తాయి.. నిజాయితీ ఎప్పటికీ ఓడిపోదు.. మీరు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది.. తులం బంగారం ఏమైంది? 4 వేల రూపాయల పించన్లు ఏమయ్యాయి?.. మీరు ఎంత నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరి పోతాయి.. మీవి అన్ని చిల్లర ప్రయత్నాలు మాత్రమే.. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించనున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు.

## ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు

### బీజేపీతో కలిసి బీఆర్ఎస్ ఇబ్బంది పెట్టే ప్రయత్నం

### ఎంపీ మల్లు రవి సంచలన వ్యాఖ్యలు

### తెలంగాణలో టీడీపీతో కలిసి ఈ పార్టీలు పోటీ?

### ఎన్ని కుట్రలు చేసినా మళ్లీ అధికారం ప్రజా ప్రభుత్వానిదే

### మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చట్టానికి అతీతులా అని నిలదీత

హైదరాబాద్: ప్రభుత్వాన్ని కూల్చకే కుట్రలు చేస్తున్నారని ఎంపీ మల్లు రవి మండిపడ్డారు. బీజేపీతో కలిసి బీఆర్ఎస్ ప్రజా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ కలిసి తెలంగాణలో పోటీ చేయబోతున్నాయని బాంబ్ పేల్చారు. ముగ్గురు కలిసి ఎన్ని కుట్రలు చేసినా ప్రజా ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందన్నారు. కెసిఆర్ కు కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన నోటీసులకు కాంగ్రెస్ ప్రభుత్వానికి సంబంధం లేదని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చట్టానికి అతీతులా? ఎంతో మంది మాజీ ముఖ్యమంత్రులు జైలుకి వెళ్ళారు అని అన్నారు. బిహార్ లో లాలు ప్రసాద్ యాదవ్ జైలుకు వెళ్లలేదా? కేసీఆర్, హరీష్, ఈటెల కమిషన్ ముందు హాజరు కావాలన్నారు. ఇప్పుడైనా కాళేశ్వరం కమిషన్ కు సహకరించాలని మల్లు రవి సూచించారు.

